జై శ్రీమన్నారాయణ!

జీయర్ శతాబ్ది - ౨౦౦౯

# ఇష్టికార్యక్రమ వివరములు

| తేది | ఇష్టి | ఫలము |
|---|---|---|
| 30.4.2009 గురువారము | శ్రీసుదర్శనేష్టి | సర్వవ్యాధి నిర్మూలనం, సర్వవిధ యజ్ఞసంరక్షణ |
| 1.5.2009 శుక్రవారము | శ్రీవైభవేష్టి | పితరుల శాంతి |
| 2.5.2009 శనివారము | శ్రీవైనతేయేష్టి | సత్సంతాన ప్రాప్తి |
| 3.5.2009 ఆదివారము | శ్రీలక్ష్మీనారాయణేష్టి | దారిద్ర్య నిర్మూలనం సర్వసంపత్సమృద్ధి |
| 4.5.2009 సోమవారము | శ్రీహయగ్రీవేష్టి | సర్వవిధ విద్యాభివృద్ధి |
| 5.5.2009 మంగళవారము | పరమేష్టి | సర్వరోగ నాశకం సదారోగ్యదాయకం |
| 6.5.2009 బుధవారము | శ్రీవిష్వక్సేనేష్టి | సర్వత్ర విజయప్రాప్తి |
| 7.5.2009 గురువారము | శ్రీవాసుదేవేష్టి | సద్బుద్ధికై సంకల్పసిద్ధికై |
| 8.5.2009 శుక్రవారము | శ్రీనృసింహేష్టి | గ్రహపీడానివారణకు |
| 9.5.2009 శనివారము | వైయ్యూహికేష్టి | సుజలాలకై సుఫలాలకై సస్యశ్యామల దేశానికై |

జై శ్రీమన్నారాయణ!

జీయర్ శతాబ్ది - ౨౦౦౯

# "ఇష్టిశాల"

"ఏష వోஉస్తు ఇష్టకామధుక్" "యజ్ఞమే అన్ని కోరికలను తీర్చే సాధనము" అంటూ యజ్ఞాలను కోరికలను తీర్చేసాధనాలుగ భగవద్గీత తెలిపింది.

ఏ కోరికా లేకుండా భగవత్సేవగ జీవించడం ఉత్తమమైన పద్ధతి. కోరికంటూ కలిగితే అది తీరే మంచిపద్ధతిని భగవానుడే అనుగ్రహించాడు. కోరినది పొందాలంటే, అవరోధాలు కూడా తొలగాలి.

ఇష్టమును పొందడానికి, అనిష్టములును తొలగించుకోడానికీ సాధనమైన వైదిక క్రియను "ఇష్టి" అంటారు.

దశరథుడు చేసిన "పుత్రకామేష్టి" శ్రీరామాయణంలో ప్రసిద్ధము.

మన పెద్దజీయరుస్వామివారు 1972లో తిరుమలకొండపై వానలను కోరి చేసిన "కారీరి ఇష్టి" ఈతరంలోకూడా యజ్ఞప్రభావానికి నిదర్శనము.

మంచిగ కోరికలను పొందేందుకు చేసుకోదగిన "ఇష్టుల"ను శ్రీమన్నారాయణ సంహిత విపులంగ తెలిపింది. విద్యనో, ఆరోగ్యాన్నో, గ్రహపీడానివారణనో, ధనాన్నో, ఉద్యోగాన్నో, శత్రుపరాజయాన్నో, విజయాన్నో, వ్యాపారాన్నో, వ్యవసాయాన్నో.... ఏదో ఒకదానిని కోరుకున్నపుడు ఆచరించే సమగ్ర విధానాన్ని మన ఆచార్యులు స్పష్టంచేసారు.

"జీవా" ప్రాంగణంలో జరిగే జీయర్‌శతాబ్ది–2009లో భాగంగ ప్రత్యేక ఇష్టిశాలలో రోజుకొక ఇష్టి ద్వారా భగవద్బంధువుల అభీష్టాలన్ని సిద్ధింపచేసే భగవత్ప్రార్థనలు జరుగుతాయి. హోమాలు జరుగుతాయి. శ్రద్ధాళువులు, జిజ్ఞాసువులందరూ ఈ సదవకాశాన్ని వినియోగించుకొనండి! మీమీ అభీష్టములను సిద్ధింపచేసుకొనండి! సుఖశాంతులతో జీవితాన్ని ఆనందమయం చేసుకోండి!.

జై శ్రీమన్నారాయణ!

జై శ్రీమన్నారాయణ!

## సర్వరక్షణకై

# శ్రీసుదర్శనేష్టి



## 30-4-2009

**పునర్వసు - గురువారము**

ఉదయం 7 గం॥ల నుండి 12.30 గం॥ల వరకు

---



జై శ్రీమన్నారాయణ!

**జీయర్ శతాబ్ది - ౨౦౦౮**

"సర్వవ్యాధి నిర్మూలనం- సర్వవిధ యజ్ఞసంరక్షణ"

## సుదర్శనేష్టి

రక్షణ అంటే.... అభీష్టాన్ని అందించడం అనిష్టాన్ని తొలగించడం అని అర్థం. ఇది అన్ని చోట్ల అందరికీ అవసరమే. మనం ఏ మంచిపని చేయాలనుకున్నా ఈ రక్షణ తప్పనిసరి. ఇది ఉంటేనే అభీష్టమైన ఫలం అందంగా దర్శనమిస్తుంది. అందమైన దర్శనానికే "సుదర్శనం" అనిపేరు. మనకు అభీష్టమైన ఫలం ఆ "భగవంతుడే" అని విశ్వసించిన వారికి ఆ విష్ణుమార్గప్రదర్శనం చేయించేదీ ఆ సుదర్శనమే. అందుకే ఆ సుదర్శనాన్ని సర్వతోముఖరక్షణకు సంకేతంగా శాస్త్రం బోధించింది.

భగవంతుని నమ్మినవారికి స్వామి చేతిలో మనసైన ఆభరణంగా ప్రియాన్ని కలిగిస్తుంది. నమ్మనివారికి అది మారణాయుధమై భయాన్ని రగిలిస్తుంది. రక్షణ శిక్షణలలో స్వామికి ప్రధాన సాధనమిదే! ఈ రక్షణచక్రాన్ని పొంది విష్ణుమార్గంలో పయనించాలనుకునేవారు చేసే ప్రతికర్మ యజ్ఞమయంగానే ప్రకాశిస్తుంది. అలాంటి యజ్ఞసంరక్షణార్థమై బ్రహ్మ అడిగిన ప్రశ్నకు "యజ్ఞసంరక్షణార్థం హి ఇష్టిం కుర్యాత్ సుదర్శనం" అని పరమాత్మ చెప్పిన సమాధానమే ఈ సుదర్శనేష్టి. దీనిని ఆచరించినవారి జీవనానికి అద్భుతమైన రక్షణచక్రం లభిస్తుంది.

శ్లో॥ యావద్యజ్ఞావసానస్తు విఘ్నజాలం వినశ్యతి ।
వ్యాధిభ్యః పీడితాః పౌరాః సర్వేప్యస్మిన్ తు కర్మణి ॥
హవిఃప్రాస్య భవేయుస్తే తత్క్షణాత్తు నిరామయాః ।

ఈ ఇష్టిని ఆచరించేవారి జీవనయజ్ఞమంతా నిరంతరాయంగా సాగుతుంది. ఈ ఇష్టిప్రసాదాన్ని స్వీకరిస్తే చాలు! ఆధివ్యాధులన్ని అంతమవుతాయి. అందుకే "సుదర్శనేష్టి"ని ఆచరించుదాం! స్వామిరక్షణలో ఆనందంగా జీవించుదాం!

జై శ్రీమన్నారాయణ!

జై శ్రీమన్నారాయణ!

# పితరుల శాంతికై

# వైభవేష్టి



## 1-5-2009

**పుష్యమి - శుక్రవారము**

ఉదయం 7 గం॥ల నుండి 12.30 గం॥ల వరకు

జై శ్రీమన్నారాయణ!

**జీయర్ శతాబ్ది - ౨౦౦౮**



పితరుల శాంతికి

## వైభవేష్టి

జీవితంలో తెలియని ఇబ్బందులు, కుటుంబాలలో అశాంతి, మానసిక క్లేశాల వంటివాటికి కారణం పితృదేవతలు తృప్తిపడకపోవడం. పితరులను విధివిధానంగ తృప్తిపరచడం సంతానానికి మొదటి కర్తవ్యం. "పుత్" అనే నరకం నుండి తన పెద్దలను తరింపచేసేవాడే "పుత్రుడు" అని గోపథబ్రాహ్మణం స్పష్టంచేస్తోంది. "పున్నామనరకం అనేక శతతారం తస్మాత్ త్రాతీతి పుత్రః, తత్ పుత్రస్య పుత్రత్వం" అని.

పితరులకు శాస్త్రవిధానంలో తర్పణాలు అర్పించడం పుత్రులవిధి. కర్తవ్యాన్ని విస్మరించడం సహించరాని నేరమని భగవద్గీత చెపుతోంది. ఇంతవరకూ చేయనివారు ఏంచేయాలి? ఆదోషాలెలా తొలగాలి? పితృదేవతలెలా తరించాలి? వారి వంశీయులు సుఖజీవనం సాగించాలంటే ఏమిచేయాలి? బ్రహ్మగారి ప్రశ్నకు భగవంతుడు చూపించిన సులభోపాయమే "వైభవేష్టి".

శ్లో॥ ఏతదిష్టి ప్రభావేన శతపూర్వాః శతాపరాః ।
తద్వంశజా మహాభాగాః భవేయుః వీతకిల్బిషాః ॥
తద్బాంధవాః సహృదయాః తథైవ పరిచారకాః ।
శ్రీవైష్ణవత్వ మాపన్నాః ప్రాప్నువంతి పరంపదమ్ ॥

పితరులందరూ ఈ ఇష్టిప్రభావంవల్ల సంతృప్తి చెందుతారు, తరిస్తారు. చేసినవారంతా భాగ్యవంతులౌతారు. వారి బంధుజనులు కూడా ఉత్తమస్థానాన్ని పొందుతారు. ఈ ఇష్టిలో భాగంగ పంచసంస్కారాలు గూడ పొందడం శ్రేయస్కరం. "తాపః పుండ్ర స్తథా నామ మన్త్రో యాగశ్చ పంచమః" శంఖచక్రాలు భుజాన ధరించడం, నుదుట ఊర్ధ్వపుండ్రము, దాసనామము, ఆచార్యులిచ్చు మంత్రములను శ్రద్ధతో జపిస్తూ, భగవంతుని పరికరముగ జీవితాన్ని గడపడం అనే "ఐదు" సంస్కారాలను పొంది, శ్రీవైష్ణవజన్మ లభిస్తే వందతరాలు ముందూ, వెనుక గూడ తరిస్తాయని శాస్త్రం. అందుకే దీనిని "వైష్ణవేష్టి" అని కూడా అంటారు.

మనకు తెలియని దోషాలను తొలగించి "మంచిసంపదలను పెంచే ఇష్టి" కనుక దీనిని "వైభవేష్టి" అని కీర్తించాయి శాస్త్రాలు.

జై శ్రీమన్నారాయణ!

జై శ్రీమన్నారాయణ!

# సత్ సంతాన ప్రాప్తికై

# వైనతేయేష్టి



## 2-5-2009

**ఆశ్లేష - శనివారము**

ఉదయం 7 గం॥ నుండి 12.30 గం॥ వరకు

జై శ్రీమన్నారాయణ!

**జీయర్ శతాబ్ది - ౨౦౦౮**

సత్సంతాన సమృద్ధికై

## వైనతేయేష్టి

సంతానమంటే..... ఎడతెగని పరంపర. ఎదతాపులను విరజిమ్మే తామరతంపర. మనం పాటించే ధర్మాలను, ఆచారాలను, సంప్రదాయాలను నిరంతరంగా, నిత్యనూతనంగా ప్రవహింపచేసేదే సంతానం. సంతానం కేవలం మనకు ప్రతిరూపమే కాదు. మన ఆశయాలకు, ఆచారాలకు కూడా ప్రతిరూపం కావాలి. మన సంప్రదాయాలను మరో తరానికి అందించేదే "సత్సంతానం". ఎన్నితరాలు సాగినా, ఎన్ని అంతరాలు కలిగినా వంశపు తత్త్వాన్ని సమృద్ధం చేసేదే సత్సంతానం. అది లేని బంధాలు అడవికాచిన వెన్నెలలే! అలా బ్రతుకులు వ్యర్థంకాకుండా ఉండాలంటే సత్సంతానం కావాలి. అది కూడా ముసలితనంలో పెద్దల్ని పోషించేది కావాలి. మన ఆచారాలను, సంప్రదాయాలను ముందు తరాలకు అందించగలిగే సత్సంతానమై ఉండాలి. అలాంటి ఆశయంతోనే త్రేతాయుగంలో దశరథుడు "పుత్రకామేష్టి"ని ఆచరించాడు. యుగయుగాలకు చెదరని ఆదర్శమూర్తులైన శ్రీరామ భరత లక్ష్మణ శత్రుఘ్నులనే పుత్రులను పొందాడు. నేటికీ కీర్తిమూర్తిగా ప్రకాశిస్తున్నాడు. అలాంటి సంతానం కోసం సామాన్యమానవుడు ఏంచేయాలి? "అపుత్రస్య గతి ర్నాస్తి" అనే శాపంనుండి ఎలా బయటపడాలి? ఇది లోక హితైషి అయిన బ్రహ్మదేవుని ప్రశ్న. దానికి స్వామి చెప్పిన సమాధానమే ఈ వైనతేయేష్టి.

సంతానం లేకపోవడానికి ఎన్నో కారణాలు. అవి నాగదోషాలు కావచ్చు, రాగదోషాలు కావచ్చు అన్నింటిని శమింపచేసే అద్భుతమైన ఇష్టి "వైనతేయేష్టి" దీనికే "పుత్రకామేష్టి" అని మరో పేరు.

శ్లో॥ యత్కృత్వా యజ్ఞకర్తా చ తత్సహాయక సజ్జనాః ।
శీఘ్రం విందంత్యభీష్టార్థాన్ ప్రాప్నువంతి సుతాన్ సతః ॥

దీనిని ఆచరించినవారికి మాత్రమేకాదు! అతనికి సహకరించిన సజ్జను లందరికి సర్వాభీష్టాలు నెరవేరుతాయి. సత్సంతానాలు కలుగుతాయి అని పరమాత్మ చెప్పిన పుత్రేష్టి ఇది! ఆచరించండి! సత్సంతానాన్ని పొంది సత్సమాజాన్ని పెంపొందించండి!!

జై శ్రీమన్నారాయణ!

జై శ్రీమన్నారాయణ!

## దారిద్ర్య నిర్మూలనం, సర్వసంపత్సమృద్ధి

# శ్రీ లక్ష్మీనారాయణేష్టి



**3-5-2009**

**మఖ - ఆదివారము**

ఉదయం 7 గంటల నుండి 12.30 గంటల వరకు

---

జై శ్రీమన్నారాయణ!

**జీయర్ శతాబ్ది - ౨౦౦౮**



సర్వ దారిద్ర్యశమనానికై

## శ్రీలక్ష్మీనారాయణేష్టి

అదాన దోషేణ భవేద్దరిద్రః దారిద్ర్యదోషేన కరోతి పాపం ।
పాపాదవశ్యం నరకం ప్రయాతి పునర్దరిద్రః పునరేవ పాపీ ॥

"శతహస్తసమాహార సహస్రహస్త సంకిర" వందచేతులతో సంపాదించు! వెయ్యిచేతులతో దానం చెయి! అంటోంది అథర్వవేదం. మానవులందరికీ "దానాన్ని" పరమధర్మంగా యజుర్వేదం బోధించింది. దేవతలకు దమం, అసురులకు దయ, మానవులకు దానం పరమ ధర్మాలుగా ఉపనిషత్ బోధిస్తుంది.

గుడి ముంగిట బిచ్చగాడు ధర్మంచేయి బాబూ! అంటూ దానమే మనకు పరమధర్మంగా గుర్తుచేస్తూ.... దానం చేయకపోతే పట్టేదుర్గతికి తన్నుతాను ఉదాహరణగా చూపించుకుంటాడు. అవకాశం ఉండి కూడా, తన విభవానికి తగినట్లు ధనాన్ని సత్కార్యాలకు దానం చేయనివాడు తరువాతి జన్మలో దరిద్రుడై పుడతాడు. దారిద్ర్యం వల్ల అనేక పాపాలకు ఒడికడతాడు. పాపఫలంగ మళ్ళీ దరిద్రుడై పుడతాడు. మళ్ళీపాపం..... మళ్ళీ దరిద్రజన్మ.... ఇలా దుఃఖచక్రంలో తిరుగుతునే ఉంటాడు.

దారిద్ర్యం అనేది అతిభయంకరమైన శాపం! దారిద్ర్యం నుండే అన్ని అశాంతులు పుడుతున్నాయి. వాటినుండే అన్ని అలజడులు మొదలవుతున్నాయి. ఈ చక్రం నుండి విడివడాలంటే ఏమి చేయాలి? ఈ దారిద్ర్యం అంతమైతేతప్ప లోకం స్థిమితంగా ఉండదు. అందుకే లోకకల్యాణం కోసం బ్రహ్మ అడిగిన ప్రశ్న........

శ్లో॥ సర్వదారిద్ర్య శమనం ఇష్టిమేకం సవిస్తరమ్ ।
తద్విధానాధికం బ్రూహి లోకకళ్యాణహేతవే ॥ అని.

ఈ ప్రశ్నకు పరమకారుణికుడైన పరమాత్మ ఉపదేశించిన విధానమే "లక్ష్మీనారాయణేష్టి".

శ్లో॥ యత్కృత్వా తు నరా భూమౌ లభన్తే సర్వసంపదః ।
దారిద్ర్య భయనిర్ముక్తాః మోదన్తే దివికైస్సమమ్ ॥
సర్వసౌభాగ్య భోగాదీన్ మహావైభవసంచయాన్ ।
ప్రాప్నువన్తి చ తే శీఘ్రం అనేనైవ హి కర్మణా ॥

అదాన దోషమూ తొలగిపోవాలి. దారిద్ర్యశమనమూకలిగి తీరాలి. ఈ దోషాలు పోయి ఇహంలో సర్వసౌభాగ్య భోగాలను అనుభవించాలన్నా శ్రీలక్ష్మీనారాయణులే శరణ్యం! పరంలో పరమానందాన్ని అనుభవించాలన్నా ఆ దివ్యదంపతులే శరణ్యం!! వారి అనుగ్రహమే వరణీయం. అందుకే ఈ ఇష్టిని ఆచరించాలి! తరించాలి!!

జై శ్రీమన్నారాయణ!

జై శ్రీమన్నారాయణ!

# ఉన్నత విద్యాప్రాప్తికి

# శ్రీహయగ్రీవేష్టి



## 4-5-2009

**పుష్యమి - సోమవారము**

ఉదయం 7 గం॥ల నుండి 12.30 గం॥ల వరకు

---



జై శ్రీమన్నారాయణ!

**జీయర్ శతాబ్ది - ౨౦౦౮**

ఉన్నత విద్యాప్రాప్తికి

## శ్రీహయగ్రీవేష్టి

"విద్యలేనివాడు వింతపశువు" "విద్య" అంటే కేవలం అక్షరాలు రావడం కాదు. ఎదురైన సమస్యను గుర్తించడం, భయపడకుండా ఎదుర్కోవడం, తెలివిగ పరిష్కరించుకోవడం, ధైర్యంతో ముందుకు సాగగలగడం, వీటిని కలిగించే తెలివినే "విద్య" అంటారు.

విద్యార్థులకు, ఉద్యోగులకు, గృహస్థులకు, వ్యాపారులకూ..... వీరికి వారికని తేడాలేదు. అన్నిరంగాలలో వారికీ, అన్నిస్థాయిలలో వారికీ మంచి విద్య అవసరమే. దానిని అనుగ్రహించే "ఇష్టి"యే హయగ్రీవేష్టి.

అశ్వంలాంటి ముఖము, మానవ శరీరముతో చతుర్భుజుడైనమూర్తి హయగ్రీవుడు. శంఖ, చక్రాలు రెండు చేతులలో ఉంటాయి. కుడిచేయి అక్షమాల, జ్ఞానముద్రతో ఉంటుంది. ఎడమ చేతిలో పుస్తకం ఉంటుంది. తెల్లని ఆకృతిలో, ఎఱ్ఱని పద్మంలో లక్ష్మీసమేతుడై ఉండేస్వామియే శ్రీహయగ్రీవుడు.

చతుర్ముఖునికి వేదాలను ఉపదేశించినది ఈ రూపంతోటే. విద్యాస్వరూపిణిగ సరస్వతిని ప్రసాదించాడు శ్రీహయగ్రీవుడు. లోకంలోని విద్యాదేవతలందరూ హయగ్రీవుని లవలేశ కృపవల్లనే అంతవారైనారు. ఆదిత్యుడు శుక్లయజుర్వేదాన్ని యాజ్ఞవల్క్యుడికి ఈ రూపంతోనే ఉపదేశించినాడట. "దధ్యజ్" మహర్షి అమృతవిద్యను అశ్వనీదేవతలకు ఈ హయముఖుడై అనుగ్రహించాడు. శాస్త్రాలలో జ్ఞానోపదేశానికి సంకేతము హయముఖమే. హయగ్రీవుని ప్రార్థించినవారికి ఉత్తమవిద్య, ఉన్నత గౌరవములు లభిస్తాయని బ్రహ్మకు భగవానుడే ఉపదేశిస్తాడు.

**శ్రీహయగ్రీవ ధ్యానము:**

జ్ఞానానంద మయం దేవం నిర్మల స్ఫటికాకృతిమ్ ।
ఆధారం సర్వవిద్యానాం హయగ్రీవ ముపాస్మహే ॥

**శ్రీహయగ్రీవ మంగళమ్:**

సర్వవిద్యాస్వరూపాయ లక్ష్మీ సంశ్లిష్టవక్షసే ।
మదుపాసన లక్ష్యాయ హయగ్రీవాయ మంగళమ్ ॥

జై శ్రీమన్నారాయణ!

జై శ్రీమన్నారాయణ!

## సర్వరోగ నాశకం - సదారోగ్యదాయకం

# పరమేష్టి



## 5-5-2009

**ఉత్తర - మంగళవారము**

ఉదయం 7 గం॥ నుండి 12.30 గం॥ వరకు

జై శ్రీమన్నారాయణ!

**జీయర్ శతాబ్ది - ౨౦౦౮**

సర్వరోగనాశకం- సదారోగ్యదాయకం

## పరమేష్టి

"పూర్వజన్మకృతంపాపం వ్యాధిరూపేణ బాధతే" గతజన్మలో చేసిన పాపాలే ఈ జన్మలో రకరకాల రోగాలై పట్టిపీడిస్తాయి.

వైజ్ఞానికంగా, సాంకేతికంగా ఎంతో ఎదిగిన ఈ రోజుల్లో కూడా అంతుచిక్కని రోగాలెన్నో! తనువును అణువణువూ శోధించగలిగే వైద్యవరులకు కూడా అంతుపట్టని, అర్థంకాని రోగాలెన్నో ఉన్నాయి. గతజన్మల కర్మబీజాలే కారణాలు! వాటిని నివారించగలిగేది ఒక్కపరమాత్మ యొక్క అనుగ్రహమే! భౌతికంగా ఎన్ని ఔషధాలు వాడినా సకలరోగబీజాలనాశనానికి భగవదనుగ్రహమే శరణ్యం! ఈ రహస్యం తెలిసికొనగోరి పరమేష్టి "సర్వరోగ ప్రశాంతర్థం" అంటూ అడిగిన ప్రశ్నకు సమాధానమే పరమేష్టి!

శ్లో॥ ఏతదిష్టి ప్రభావేన సర్వేశామ్యన్తి చామయాః ।
సదారోగ్యం భవేచ్చైవ సుఖం విందంతి తత్క్షణాత్ ॥

ఈ ఇష్టిప్రభావం చేత సర్వరోగాలు నశిస్తాయి. సదా ఆరోగ్యవంతులై సుఖంగా ఉంటారు. అంతేకాదు! ఈ ఇష్టిని ఆచరించే ఇంట్లోనివారందరికిన్ని మహాభాగ్యమైన "సదారోగ్యం" కలుగుతుంది. దానితో అంతా సుఖిస్తారని శ్రీ భగవానువాచ.

"ఆరోగ్యమే మహాభాగ్యం" కదా! ఆరోగ్యమే లేనివాడు ఎంతటి మహాభాగ్యం ఉన్నా నిరర్థకమే! ధర్మాచరణకు ప్రధాన, ప్రథమ సాధనం శరీరమే కదా! శరీరం ఆరోగ్యంగా ఉంటేనే ఎన్ని ధర్మాలైనా ఆచరించగలం! ఎన్ని యజ్ఞయాగాదులైనా చేయగలం!

ఆరోగ్యాన్ని కాపాడుకుందాం! ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మిద్దాం!!

జై శ్రీమన్నారాయణ!

జై శ్రీమన్నారాయణ!

# శత్రునివారణ-విజయప్రాప్తికై

# శ్రీవిష్వక్సేనేష్టి



## 6-5-2009

హస్త - బుధవారము

ఉదయం 7 గం॥ల నుండి 12.30 గం॥ల వరకు

---

జై శ్రీమన్నారాయణ!

జీయర్ శతాబ్ది - ౨౦౦౮

శత్రునివారణ-విజయప్రాప్తికై

## విష్వక్సేనేష్టి

విజయప్రాప్తి అనేది అన్నివర్గాలవారికీ అన్నిరంగాలవారికీ అవసరమే. చదువుకునే విద్యార్థికి పరీక్షలలో విజయంకావాలి. ఉద్యోగం చేసే వానికి ఉత్తరోత్తరాభివృద్ధిలో విజయంకావాలి. ఆడేవారికి విజయంకావాలి. పాడేవారికి విజయంకావాలి. దేశంకోసం పోరాడేవారికి విజయం కావాలి. దేశప్రజలను కాపాడే వారికి విజయంకావాలి. అంతెందుకు?! ఆధ్యాత్మిక జీవనాన్ని గడిపేవారికి కూడ వారివారి సాధనలలో విజయప్రాప్తి కావలసినదే కదా!

విజయప్రాప్తి..... అంటే ఎలాంటి విఘ్నాలూ లేకుండా సాధనలు కొనసాగడం. విఘ్నాలు లేకపోవడం కూడ విజయాలు కలగడానికి సూచన. విఘ్నాలు లేని దాని విజయాలు కావాలంటే విష్వక్సేనుని ఆరాధించాల్సిందే.

విష్వక్సేనుడు శ్రీవైకుంఠపురపాలకుడు- పరిపాలకుడు. ఈ సకల చరాచరజగత్తును సంరక్షించేవాడు..... శ్రీమహావిష్ణువైతే.... అతనిని, అతని అంతఃపురాన్ని సంరక్షించే మహావీరుడు....విష్వక్సేనుడు. అంతేకాదు.... శ్రీమహావిష్ణువు తనదేవేరితో విహరిస్తూ ఈ విశ్వచిదచిత్ సంరక్షణాధికారాన్ని ఈయనకే అప్పగిస్తాడుట. పంచాయుధాలతో స్వామి, నిర్వర్తించే ఈ మహత్కార్యాన్ని కేవలం తన తర్జనీ ముద్రతో (చూపుడువేలి కదలికతో)నే నిర్వహించే నైపుణ్యంకల సేనాధిపతి.... ఈయన. అందుకే స్వామికి ఈయన ప్రియుడు. ఈయనకు స్వామి, ప్రియాతిప్రియుడు.

శత్రునాశనానికి, విజయప్రాప్తికీ విష్వక్సేనుని అనుగ్రహం కావాలి. ఈ విషయాన్ని లోకానికి వెల్లడించడానికై బ్రహ్మదేవుడు అడిగిన ప్రశ్నకు సమాధానంగా స్వామి ఉపదేశించిన హోమవిధానమే ఈ విష్వక్సేనేష్టి.

విష్వక్సేనాభిధం త్విష్టి విధానం విధిచోదితః ।
సర్వశత్రుహరం చైవ సర్వసంపత్ప్రదం భువి ॥
సంగ్రామేషు జయప్రాప్తి సాధనం సర్వథాపి చ ।

సర్వశత్రు వినాశకము, సకల విజయప్రాప్తిసాధనమూ ఈ ఇష్టి. ఈ ఇష్టివల్ల అంతఃశత్రువులు నశిస్తాయి. బహిఃశత్రువులూ నశిస్తారు. భౌతిక విజయాలతోపాటు ఆధ్యాత్మిక విజయాలు కూడ అందుతాయి.

ఆచరించుదాం! విఘ్నాలను అతిక్రమిస్తూ విజయపథంలో పయనించుదాం!!

జై శ్రీమన్నారాయణ!

జై శ్రీమన్నారాయణ!

# సద్బుద్ధికై - సంకల్పసిద్ధికై

# శ్రీవాసుదేవేష్టి



## 7-5-2009

చిత్త - గురువారము

ఉదయం 7 గం॥ల నుండి 12.30 గం॥ల వరకు



జై శ్రీమన్నారాయణ!

జీయర్ శతాబ్ది - ౨౦౦౮

సద్బుద్ధికై - సంకల్పసిద్ధికై

## వాసుదేవేష్టి

అంతటా అన్నిటా వ్యాపించి ఉన్న పరమాత్మతత్త్వానికే "వాసుదేవుడు" అని పేరు. ఆ తత్త్వాన్ని గుర్తించడమే "సద్బుద్ధి", ఆ సద్బుద్ధితో చేసే ప్రతి సంకల్పం సిద్ధిస్తుంది. అలా సిద్ధించి ప్రతి సంకల్పం సద్బుద్ధిని మరింతగా పెంపొందిస్తుంది. పరస్పరపూరకాలైసాగే ఈ రెండూ పరమాత్మ యొక్క అనుగ్రహఫలాలే!.

"న వాసుదేవ భక్తానాం" శుభాశ్రయుడైన ఆ స్వామిని ఆశ్రయించిన వారికి అశుభాలు ఉండవు. సకల శుభాలు కలుగుతాయి. అలా గుర్తించి ఆ స్వామి కైంకర్యంగా చేసే ఆరాధనమే ఈ "వాసుదేవేష్టి".

భగవంతుడెప్పుడూ పశువులకాపరిలా చేతికర్రపట్టుకొని మనల్ని మంచిదారిలో పెట్టేప్రయత్నం చెయ్యడు. ఎవడిని బాగుచేయాలని అనుకుంటాడో వాడికి మంచిబుద్ధిని కలిగిస్తాడంతే! అలా మంచిబుద్ధి కలిగినవాడు మంచి పనులను చేస్తాడు. మంచిదారిలో పయనిస్తాడు. చివరకు అన్నింటినీ మించిన మంచి చోటును పొందుతాడు. మంచి బుద్ధికలిగితే చాలు మంచిసిద్ధి కలుగుతుంది. అలా ప్రతిసంకల్పం సిద్ధిని పొందాలంటే ఏమి చేయాలి? అనే బ్రహ్మదేవుని ప్రశ్నకు సమాధానంగా "దీక్షాసిద్ధిర్భవేత్తేన ధ్రువం నాన్యేన వర్త్మనా" అంటూ సంకల్పసిద్ధికావాలంటే ఇది తప్ప వేరు గతిలేదంటూ పరమాత్మ చెప్పిన ఉపాయమే ఈ "వాసుదేవేష్టి".

ఈ ఇష్టివలన అన్ని పాతకాలూ మన నుండి విడిపోతాయి. అన్ని కోర్కెలూ నెరవేరుతాయి. ఈ ఇష్టిలోని తర్పణ క్షీరాన్ని తీర్థంగా స్వీకరిస్తే ముక్తి కరతలామలక మవుతుంది. గ్రహపీడాదులు, వ్యాధులు అన్నీ తొలగిపోతాయి. హాయిగా, ఆనందంగా జీవిస్తారనడంలో ఏ సందేహం లేదు. ఈ ఇష్టిలో మనం చేసే కుంకుమార్చన వల్ల శ్రీలక్ష్మీ మన ఇంట స్థిరనివాసముంటుంది.

శ్లో॥ కిమత్ర బహునా బ్రహ్మన్! ఇష్ట్వాఖ్యానేన కర్మణా ।
భవిష్యంతి హి సంపూర్ణం సర్వ యజ్ఞఫలాని చ ॥

ఇన్ని మాటలేల?! అన్ని యజ్ఞఫలాలను మన ముంగిట కుమ్మరించేసర్వయజ్ఞఫలాల వృష్టి ఈ "వాసుదేవేష్టి" అనన్యగతికంగా ఆ వాసుదేవుని అనుగ్రహాన్ని మాత్రమే కోరుతూ చేసేవారి ముందు అన్ని ఫలితాలూ వాటంతట అవే వ్రాలుతాయి. అలా గుర్తించి ఆచరించే సద్బుద్ధిని, తద్వారా సంకల్పసిద్ధిని కలిగించే అద్వితీయేష్టి! ఈ "వాసుదేవేష్టి".

జై శ్రీమన్నారాయణ!

జై శ్రీమన్నారాయణ!

# గ్రహపీడా నివారణకు

# శ్రీనృసింహేష్టి



## 8-5-2009

స్వాతి - శుక్రవారము

ఉదయం 7 గం॥ల నుండి 12.30 గం॥ల వరకు



జై శ్రీమన్నారాయణ!

జీయర్ శతాబ్ది - ౨౦౦౧

గ్రహపీడా నివారణకు

## నృసింహేష్టి

గాలిసోకిందని కొందరు, ఎవరో ఏదో ప్రయోగించారని ఇంకొందరు, గ్రహాలు పీడిస్తున్నాయని దాదాపు అందరూ శారీరక పీడతోనో, మానసిక పీడతోనో బాధలు పడుతూంటారు. ఆపీడలనుండి తమను విడిపించుకోవటానికి, ఆబాధలను వదిలించుకోవడానికి ఏదో దేవతను ఆశ్రయిస్తూంటారు. కానీ అనేక శాంతులు, అనేక ఉపశమనాలు అవసరంలేదు.

మనసారా నరసింహుని స్మరిస్తేచాలు, అన్ని రకాల దుష్టగ్రహాలు పలాయనం చిత్తగిస్తాయి. అందుకే ఆయనను మంత్రశాస్త్రం "మృత్యుమృత్యువు"గా కీర్తించింది. అంటే మృత్యుభయాన్ని కలిగించే దుష్టగ్రహాలకు కూడా మృత్యువన్నమాట.

ఇంతకు ఎవరా దుష్టశక్తులు? అందరిని ఇలా ఎందుకు వేధిస్తున్నారు? ఆ బాధల విముక్తికి మార్గమే లేదా? అని బ్రహ్మదేవుని ప్రశ్న. దానికి సర్వేశ్వరుని సమాధానమే ఈ "నృసింహేష్టి".

పరమాత్మను గుర్తించక తమకోరికలు తీరడమే ప్రధానంగ జీవించేవారూ, వైదిక కర్మలనూ దానికే ఆచరించేవారంతా ఈ సమాజంలో దుష్టగ్రహాలే. వారి దుష్కర్మలే వారిని దుష్టరూపాలుగ మారుస్తాయి. వారుమనుష్యులను ఆవహించి అనేక దైహికబాధలను, మనఃపీడలను కలిగిస్తూంటారు. ఆ దుష్టశక్తులు తరించాలన్నా, తత్పీడితులు, బాధితులు వాటి బారినుండి బయటపడాలన్నా ఆచరించదగిన ఉత్తమ ప్రక్రియ "నృసింహేష్టి".

ఈ ఇష్టిప్రభావం చేత గ్రహపీడ తొలగుతుంది. ఆదుష్టగ్రహాలకు కూడా దుష్కర్మల శాపాలు నశించి అవి వైకుంఠాన్ని పొందుతాయి. పీడించేవారికీ, పీడితులకు కూడా ఉభయతారకమైనది ఈ ఇష్టి.

ఈ ఇష్టిని ఆచరించినవారు..............

శ్లో: తదారభ్య మహాభోగ్య భాగ్య భోగాదిభిర్వృతః ।
స జీయాత్ శతవర్షాణి నృహరేః కృపయా భువి ॥

తా॥ శ్రీ నృసింహదేవుని కృపాకటాక్షంవల్ల ఇహంలో మహాభోగ్య భాగ్యాలను అనుభవించి దీర్ఘాయుష్మంతులై, పరంలో స్వామి సన్నిధానాన్ని పొందుతారు.

జై శ్రీమన్నారాయణ!

జై శ్రీమన్నారాయణ!

## సుజలాలకై సుఫలాలకై - సస్యశ్యామల దేశానికై

# వైయ్యూహికేష్టి



సమ్మోదము
(సారూప్య వైకుంఠము)
సంకర్షణ - స్థితి

ప్రమోదము
(సాలోక్య వైకుంఠము)
ప్రద్యుమ్న - సృష్టి

ఆమోదము
(సామీప్య వైకుంఠము)
అనిరుద్ధ - సంహారము

**9-5-2009**

**విశాఖ - శనివారము**

ఉదయం 7 గం॥ల నుండి 12.30 గం॥ల వరకు

జై శ్రీమన్నారాయణ!

**జీయర్ శతాబ్ది - ౨౦౦౮**

సుజలాలకై సుఫలాలకై - సస్యశ్యామల దేశానికై

# వైయ్యూహికేష్టి

"స్వార్థాన్ని విడిచిపెట్టండి" ఇది సామాన్యంగ అందరు చెప్పేమాట. స్వార్థాన్ని మరింతగ పెంచుకోండి ఇది తత్త్వజ్ఞులైన మనస్వామివారు వంటివారు చెప్పేమాట. తమాషాగ ఉంది కదూ! నిజమే! స్వార్థంలేని జీవితం లేదు. నిజానికి స్వార్థం లేకపోతే జీవితమే లేదు. మరి అలా అవినాభావంగ ఉండే స్వార్థాన్ని విడిచిపెట్టడం సాధ్యమేనా?! అసాధ్యం కదా! అసాధ్యమైన పనులను మనపెద్దలు చెప్పరు కదా! పోనీ సాధ్యమే అయితే మనం ఎంత వదిలించుకోవాలని అనుకున్నా... ఎంత విదిలించుకోవాలని అనుకున్నా... స్వార్థం వదలడం లేదు. "మేము నిస్సంగులం మాకు ఏస్వార్థం లేదు" అని అనుకునేవారి విషయంలో కూడ స్వార్థమేదో ఒకమూలనుండి తొంగి చూస్తూనే ఉంది కదా! ఎవరైనా ఎంతటివారైనా స్వార్థాన్ని పోగొట్టుకొనలేకపోతున్నారనేది నిశ్చయం. అలాంటప్పుడు దాన్ని సక్రమంగ పెంచుకోటమే నయం కదూ! అందుకే త్రెంచుకోలేని స్వార్థాన్ని మరింతగ పెంచుకుందాం! మనవారందరితో పంచుకుందాం!! అది ఎలా?

"స్వార్థం" అంటే "నాకోసం" అని అర్థం. ప్రతీదీ నాకు కావాలి. నాకే కావాలి ఇలాంటి భావనలన్నీ ఈ కోవలోనికే వస్తాయి. "నాకు" అనే ప్రతీవాని స్వార్థంలో నావాళ్ళు- నాకుటుంబం అనేవి అంతర్గతంగ ఉంటాయి. నేను, నాభార్య లేక నాభర్త, నాపిల్లలు, నాకుటుంబం.... ఇలా సంకుచితంగ ఉండే స్వార్థభావాన్ని మరికొంచెం పెంచి నాగ్రామం, నాసమాజం, నారాష్ట్రం, నాదేశం, నావిశ్వం.... ఇలా స్వార్థాన్ని "ఇంతింతై వటుడింతయై" అన్నట్లు పెంచితే చాలు. అలా స్వార్థాన్ని పెంచుకున్నవారినే మహాత్ములని అంటారు. ఇలా వసుధైక కుటుంబంగ జీవించే ఉత్తమవిధానాన్ని నేర్పినది మన సనాతన వైదిక సంప్రదాయమే......

ఇప్పుడు మనచుట్టూనే ఉండే స్వార్థం..... విశ్వాన్ని చుట్టుకుంది. అప్పుడు విశ్వంలో ప్రతిజీవీ మనకు సంబంధించినదే. ఇప్పుడు మనవాళ్ళకోసం ఏ మంచి చేయాలనుకున్నా అది మన స్వార్థమే! ఈ మహాస్వార్థం మంచిది. ఇదే మనం అలవరచుకోవలసినది కూడా. ఇలాంటి హృదయ వైశాల్యంతో బ్రహ్మదేవుడు అడిగే ప్రశ్నకు పరమాత్మ చెప్పిన దేశభక్తి ప్రబోధకమైన ఉపాయమే...... ఈ "వైయ్యూహికేష్టి"

"సుభిక్షం సర్వసమృద్ధిః సువృష్టిశ్చ భవేత్ ప్రభో! । నాదేశం సుభిక్షంగ ఉండాలి! నాదేశ ప్రజలంతా సర్వసమృద్ధితో జీవించాలి! అతివృష్టి- అనావృష్టులు కాకుండా సువృష్టి వడాలి. "సర్వేజనాః సుఖినో భవంతు" ఇదిమన పూర్వులు నుడివిన మాట. నడచిన బాట. ఇలా విశ్వంలోని నావారంతా బాగుండాలి! అనే హృదయ వైశాల్యంతో చేయమని స్వామి ప్రబోధించిన గొప్ప ఇష్టి ఇది.

జై శ్రీమన్నారాయణ!

## జీయర్ శతాబ్ది మహోత్సవ ప్రయుక్త

శ్రీరామనగర్ శ్రీపరమపదనాథ, శ్రీరంగనాథ, శ్రీసీతాలక్ష్మణ హనుమత్సమేత
శ్రీ కోదండరామచంద్రస్వామివారి నవాహ్నిక నవకుండాత్మక
అష్టాంగవిమానయుత నూతన ఆలయ ప్రతిష్ఠా కార్యక్రమ వివరములు

| తేది | ఉదయము | సాయంకాలము |
|---|---|---|
| 27.4.2009 | బాలకుంభస్థాపన | అంకురారోపణము |
| 28.0.2009 | వాస్తుశాంతి | ఆలయ పంచగవ్యశుద్ధి |
| 29.4.2009 | అరణిమంథనము, | |
| | అగ్నిప్రతిష్ఠా, ఛాయాధివాసం | |
| | పంచ కలశ స్నపనం, | |
| | ఘృతాభిషేకం | జలాధివాసం, హోమం |
| 30.4.2009 | సప్తదశ కలశ కర్మాంగ స్నపనం | |
| | లాజాధివాసం, నేత్రోన్మీలనము | శయ్యాధివాసం |
| 1.5.2009 | బింబ, యంత్రస్థాపన, స్నపనం | తత్త్వన్యాసహోమము |
| | సామూహిక ఉపనయనాలు | |
| 2.5.2009 | షోడశ కలశ స్నపనము | చతుస్థానార్చన |
| 3.5.2009 | ఏకవింశతి కలశ స్నపనము | చతుస్థానార్చన |
| 4.5.2009 | పంచవింశతి కలశ స్నపనము | చతుస్థానార్చన |
| 5.5.2009 | ఏకోనపంచాశత్ కలశ స్నపనము | చతుస్థానార్చన |
| 6.5.2009 | ఏకాశీతి కలశ స్నపనము | చతుస్థానార్చన |
| 7.5.2009 | కుంభాభిషేకము, | |
| | మంగళవస్త్రప్రదర్శన, | |
| | ప్రథమారాధనా, | |
| | నివేదన, శాత్తుముఱై, | |
| | తీర్థపరిగ్రహణము, | గరుడోత్సవము |
| 8.5.2009 | ఆరాధన, వాహనోత్సవము | వాహనోత్సవము |
| 9.5.2009 | ఆరాధన, వాహనోత్సవము | వాహనోత్సవము |
| 10.5.2009 | కవాటోద్ఘాటనము, ఆరాధన, | |
| | స్నపనము, అలంకారము, | |
| | నివేదన, శాత్తుముఱై, తీర్థగోష్ఠి, | |
| | సర్వదర్శనము, శాంతికళ్యాణము, | |
| | ఆచార్యాది ఋత్విక్ సమ్మానము. | |

జై శ్రీమన్నారాయణ!

జై శ్రీమన్నారాయణ!

## జీయర్ శతాబ్ది మహోత్సవాలలో జరుగు

# వివిధ ఇష్టులు

30.4.2009 9.5.2009



జీయర్ ఇంటిగ్రేటెడ్ వేదిక్ అకాడమీ (జీవా)
శ్రీరామనగర్, ముచ్చింతల్, శంషాబాద్, రంగారెడ్డి జిల్లా
08414-260695